TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 80 | పేజీలు : 04| వెల: రూ.3/-    తెలంగాణ    మంగళవారం | జులై 28, 2026



## కేంద్రం ఇండ్లు కేటాయించాలి

- తెలంగాణకు 11.56 లక్షల ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన ఇండ్లు ఇవ్వాలి
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరిన సీఎం రేవంత్ రెడ్డి
- గత పదేళ్ల ఇండ్ల కేటాయింపులో నిర్లక్ష్యం



**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలోని పేదలకు సొంత ఇళ్ల కల నెరవేర్చేందుకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ (పీఎంఏవై-జీ) కింద తెలంగాణకు 11.56 లక్షల ఇండ్లను కేటాయించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి పలువురు ఎంపీలతో కలిసి కృషి భవన్‌లో కేంద్ర మంత్రితో సమావేశమయ్యారు.

## వ్యవసాయ సాంకేతికత వైపే ప్రభుత్వ అడుగులు

**వ్యవసాయ విషయాల పట్ల స్పష్టమైన అవగాహన**

**సాంకేతికత వైపు ప్రభుత్వం అడుగులు**




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వ్యవసాయాన్ని సులభంగా, లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం సాంకేతికతను జోడిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ సందర్భంగా మంగళవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల రైతు వేదికల ద్వారా అధికారులతో, రైతులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి. రైతులు ఉద్యానవన, ఆయిల్ పామ్ సాగుపై దృష్టి పెడితే అధిక లాభాలు పొందవచ్చు. నేల స్వభావం, నీటి లభ్యత ఆధారంగా ప్రతి రైతు పంట మార్పిడి విధానాలు పాటించాలని, మోతాదుకు మించి ఎరువులు వాడరాదని సూచించారు. మండల స్థాయి వ్యవసాయ అధికారులు ప్రతిరోజూ విధిగా రైతుల మధ్యే ఉండాలని స్పష్టం చేశారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలోని రైతు వేదికలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతు అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వరికి బదులుగా జొన్న, సజ్జ, పెసర, మినుము, కంది వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని కోరారు. కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ భూగర్భ జలాల లభ్యతను బట్టి ప్రభుత్వం నిర్దేశించిన సూచనలను రైతులు పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరుతడి పంటలు సాగు చేస్తున్న ఆదర్శ రైతులను ఎమ్మెల్యే, కలెక్టర్ శాలువాలతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్ రెడ్డి, ఏడీఈ నర్సింగం, ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాసరావు, ఉద్యాన శాఖ అధికారి వేణు, మండల అధ్యక్షురాలు సావిత్రి,జిల్లా ఉపాధ్యక్షులు పిన్నింటి అనిల్,స్థానిక సర్పంచ్ శంకర్, వ్యవసాయ శాఖ,సంబంధిత శాఖల అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నాపత్రాల లీకేజీలపై జాతీయ స్థాయిలో స్పష్టమైన విధానం రావాలి

- సీఎం రేవంత్ రెడ్డి
- కోచింగ్ కేంద్రాలే లీకేజీలకు వేదికలు
- విద్యను రాష్ట్రాల పరిధిలోనే ఉంచాలి
- తెలంగాణలో హైడ్రాను కొనసాగిస్తాం



2లో..

## మాజీ మంత్రి ఎస్. జైపాల్ రెడ్డి వర్ధంతి

◆ నివాళులర్పించిన సీఎం రేవంత్ రెడ్డి



**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** భారత మాజీ కేంద్ర మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ స్వర్గీయ ఎస్. జైపాల్ రెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో జైపాల్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్ తో పాటు పలువురు ఇతర ప్రముఖ నాయకులు పాల్గొని ఆ మహనీయుని సేవలను స్మరించుకున్నారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
మంగళవారం, జులై 28, 2026

# కేంద్రం ఇండ్లు కేటాయించాలి



- తెలంగాణకు 11.56 లక్షల ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన ఇండ్లు ఇవ్వాలి
- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కోరిన సీఎం రేవంత్ రెడ్డి
- గత పదేళ్ల ఇండ్ల కేటాయింపులో నిర్లక్ష్యం

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలోని పేదలకు సొంత ఇళ్ల కల నెరవేర్చేందుకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన–గ్రామీణ్ (పీఎంఏవై–జీ) కింద తెలంగాణకు 11.56 లక్షల ఇండ్లను కేటాయించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి పలువురు ఎంపీలతో కలిసి కృషి భవన్‌లో కేంద్ర మంత్రితో సమావేశమయ్యారు.

### ముఖ్యమంత్రి ప్రధాన విజ్ఞప్తులు ...

రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల ఇళ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని సీఎం తెలిపారు. గత ప్రభుత్వం పీఎంఏవై–జీ పథకాన్ని సరిగా వినియోగించుకోకపోవడంతో గత పదేళ్లలో పేదలు ఇండ్లు నిర్మించుకోలేకపోయారని, ప్రస్తుతం రాష్ట్రంలో ఇళ్ల కోసం తీవ్ర డిమాండ్ ఉందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ రూపొందించిన 'ఆవాస్ ప్లస్' యాప్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో ఏకంగా 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరగా ఈ ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. ఉపాధి హామీ (వీబీ జీ రామ్ జీ)లో అదనపు పనులు: ఎల్నినో, తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో 'వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్' చట్టంలో అదనపు పనులను చేర్చాలని సీఎం కోరారు. ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు, కూలీల జీవనోపాధుల మెరుగుదల కోసం కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్లు, మల్బరీ తోటల సాగు, పట్టు పురుగుల పెంపకం షెడ్లు, వెదురు వనాల పెంపకం వంటి వాటిని ఉపాధి హామీ పథకంలోకి తెవాలని విజ్ఞప్తి చేశారు.



### భూముల పునరుద్ధరణ..

వరదలు, ఇసుక మేటలతో దెబ్బతిన్న భూముల పునరుద్ధరణ పనులు, కొండ వాలుల్లో నీటి నిల్వ కందకాల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు నిర్మాణ సమయంలో ఉపాధి హామీ కింద 90 రోజుల పాటు పని కల్పించే వెసులుబాటు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సీఎం వెంట ఎంపీలు ఎం. అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి, పోరిక బలరాం నాయక్, సురేష్ షెట్కార్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రామసహాయం రఘురాం రెడ్డి, గడ్డం వంశీ కృష్ణ, ఎక్స్–అఫిషియో స్పెషల్ సెక్రటరీ రామకృష్ణారావు, సెక్రటరీ కో–ఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నాపత్రాల లీకేజీలపై జాతీయ స్థాయిలో స్పష్టమైన విధానం రావాలి

- సీఎం రేవంత్ రెడ్డి
- కోచింగ్ కేంద్రాలే లీకేజీలకు వేదికలు
- విద్యను రాష్ట్రాల పరిధిలోనే ఉంచాలి
- తెలంగాణలో హైడ్రాను కొనసాగిస్తాం

**న్యూఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రశ్నాపత్రాల లీకేజీలకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, ఈ విషయంలో దేశవ్యాప్తంగా ఒక కఠినమైన విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎలాంటి అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కోచింగ్ కేంద్రాలే ప్రశ్నాపత్రాల లీకేజీకి ప్రధాన వేదికలుగా మారుతున్నాయని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తే సమస్యలు రావని, ఆఫ్‌లైన్‌లోనే ఇబ్బందులు వస్తున్నాయన్నారు. యూనివర్సిటీలపై ఆధిపత్యం చెలాయించే ప్రయత్నాన్ని కేంద్రం విరమించుకోవాలని, విద్యను వీలైనంత వరకు రాష్ట్రాల పరిధిలోనే ఉంచితే తప్పిదాలకు అవకాశం తక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరగాలన్నారు.యూపీఎస్సీ విధానాన్ని ఆదర్శంగా తీసుకుని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి పారదర్శకంగా నియామకాలు చేపట్టినట్లు చెప్పారు. గతంలో గ్లోబరీనా వంటి సంస్థలు అక్రమాలకు పాల్పడినా నాటి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వల్లే అవి సీబీఈఎస్ఈ పరీక్షల వరకు విస్తరించి గందరగోళానికి దారితీశాయని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ సాగుతోందని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన బకాయిలే భారంగా మారినప్పటికీ, రాష్ట్రంలో ఏటా రూ. 2,200 కోట్ల నుంచి రూ. 2,400 కోట్ల వరకు అవసరమయ్యే ఫీజులను ఇకపై క్రమం తప్పకుండా ఆయా సంవత్సరాల్లోనే నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేలా ప్రణాళికలు రచించినట్లు స్పష్టం చేశారు. హైడ్రా కార్యాచరణపై ప్రభుత్వానికి స్పష్టత ఉందని, హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పరిశీలించి ప్రభుత్వపరంగా సమీక్షిస్తామని తెలిపారు. న్యాయస్థానాన్ని గౌరవిస్తూనే, హైడ్రా చేపడుతున్న ప్రజాప్రయోజన పనులను భవిష్యత్తులోనూ కొనసాగిస్తామని సీఎం స్పష్టం చేశారు.

# 'ముద్ర', 'జ్వాలామాలిని'గా భద్రకాళి అమ్మవారు

- శ్రీ భద్రకాళి అమ్మవారి శాకంభరీ నవరాత్రులు
- ఘనంగా అమ్మవారికి పూజలు

**వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** వరంగల్ మహానగరంలోని ప్రసిద్ధ శ్రీ భద్రకాళి దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవాలు పదవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఉదయం నిత్యాహ్నికం పూర్తి చేసిన అనంతరం తిథి మండల దేవతా యజనంలో భాగంగా అమ్మవారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజారాధనలు నిర్వహించారు. ఇచ్ఛాశక్తిని 'ముద్ర'గా, జ్ఞానశక్తిని 'జ్వాలామాలిని'గా అలంకరించి భక్తులకు అనుగ్రహించేలా పూజలు జరిపారు. భక్తుల కోర్కెలు నెరవేర్చి అమితమైన సంతోషాన్ని ప్రసాదించే తల్లిగా అమ్మవారిని శాస్త్రాలు కీర్తిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. మహబూబాబాద్‌కు చెందిన శ్రీ లక్ష్మీ శ్రీనివాస సేవా సమితి, జి.కె.రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 11 క్వింటాళ్ల కూరగాయలను దేవాలయ కార్యనిర్వహణాధికారి శ్రీమతి రామల సునీతకు సమర్పించారు. బుధవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 03:00 నుండి 09:00 గంటల వరకు అమ్మవారికి పలువిధములైన కూరగాయలు, పండ్లతో శాకంభరీ అలంకార మహోత్సవం జరగనుంది. ఈ సమయంలో సుమారు 6 గంటల పాటు అమ్మవారి దర్శనం తాత్కాలికంగా నిలిపివేయబడుతుంది. ఉదయం 09:00 గంటల నుండి భక్తులకు అమ్మవారి శాకంభరీ విశ్వరూప దర్శనం రాత్రి వరకు అందుబాటులో ఉంటుంది. భక్తుల సౌకర్యార్థం సర్వదర్శనంతో పాటు విశిష్ట దర్శనం, అతిశీఘ్ర దర్శనం, ధర్మదర్శనం క్యూలైన్లను యథావిధిగా ఏర్పాటు చేసినట్లు ఈఓ రామల సునీత తెలిపారు.







వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
మంగళవారం, జులై 28, 2026



# వకీల్ సాబ్

## చిలుకమారి వెంకటేశ్వర్లు

- నిబద్ధతే ఆయుధం.. ప్రజాసేవే మార్గం
- పేదలకు న్యాయం చేరువ చేసిన ప్రజాసేవకుడు
- అలుపెరగని బాటసారి అడ్వకేట్ చిలుకమారి వెంకటేశ్వర్లు
- సమాజ సేవకే ఆయన జీవితం అంకితం..

**నిబద్ధత, నిరంతర శ్రమ, సమాజం పట్ల బాధ్యత ఉంటే ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నిరూపించారు ప్రముఖ న్యాయవాది, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలుకమారి వెంకటేశ్వర్లు. రాజకీయ, ఆర్థిక రంగాలు విసిరిన సవాళ్లను తట్టుకుని, కుటుంబ బాధ్యతలను నెరవేరుస్తూనే, న్యాయవాదిగా, ప్రజాసేవకుడిగా తనదైన ముద్ర వేశారు. ప్రముఖ న్యాయవాది, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలుకమారి వెంకటేశ్వర్లు జీవిత ప్రయాణం తెరిచిన పుస్తకం. రాజకీయ, ఆర్థిక రంగాలు విసిరిన క్లిష్టమైన సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ, కుటుంబ బాధ్యతలను సమ్మతంగా నెరవేరుస్తూనే.. సమాజం పట్ల బాధ్యతగా మెలిగిన ఆయన తీరు స్ఫూర్తి దాయకం.**

### ప్రజాసేవ వారసత్వం – తొలి అడుగులు

మహబూబాబాద్ జిల్లా గున్నెపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు కుటుంబానికి ప్రజాసేవ కొత్తేమీ కాదు. ఆయన తండ్రిగారు గ్రామానికి వరుసగా 30 ఏళ్ల పాటు సర్పంచ్‌గా సేవలు అందించి ప్రజల గుండెల్లో నిలిచారు. తండ్రి బాటలోనే వెంకటేశ్వర్లు తన సొంత ఊరిలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రానికి స్థలాన్ని దానం చేయడంతో పాటు ముత్యాలమ్మ గుడిని నిర్మించి ఉదారత చాటుకున్నారు. స్వగ్రామం అభివృద్ధిలో తండ్రి బాటలోనే చిలుకమారి వెంకటేశ్వర్లు కుటుంబం చెరగని ముద్ర వేసింది. రాజకీయాల్లోనూ చురుగ్గా వ్యవహరిస్తూ 1987లో కాంగ్రెస్ పార్టీ తరఫున పీఏసీఎస్ ఛైర్మన్‌గా పోటీ చేయడంతో పాటు, 2004లో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యుడిగా ఎంపికయ్యారు.

### న్యాయవాదిగా ప్రస్థానం..

1987లో లా డిగ్రీ పూర్తి చేసిన వెంకటేశ్వర్లు, 1992లో అడ్వకేట్‌గా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. తన ప్రతిభ, నాయకత్వ లక్షణాలతో 2004లో మహబూబాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రజలకు న్యాయం చేరువ కావాలనే లక్ష్యంతో తొర్రూరులో జేఎఫ్ సీఎం కోర్టు, మహబూబాబాద్‌లో అడిషనల్ కోర్టు, మరిపెడలో జేఎఫ్ సీఎం కోర్టుల ఏర్పాటు కోసం ప్రభుత్వం వద్ద నిరంతరం విజ్ఞప్తులు చేస్తూ, కోర్టుల ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు.

### సంచలన తీర్పులు – రాష్ట్ర రికార్డులు..

ప్రభుత్వ తరఫున న్యాయవాదిగా (అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్, ఏపీపీఓ, అడిషనల్ పీపీ, అడిషనల్ జీపీl. GP) 2004 నుంచి 2011 వరకు సేవలు అందించిన ఆయన, 2021లో ప్రిన్సిపాల్ డ్రిస్టిక్ సెషన్ కోర్టు మహబూబాబాద్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా (అడిషనల్ పీపీ) పునర్‌నియామకమై, ఆ తర్వాత ఇన్‌ఛార్జ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన పదవీకాలంలో న్యాయవ్యవస్థలో చరిత్ర సృష్టించే పలు తీర్పులు వచ్చాయి. ఒక కేసులో ముద్దాయికి మరణశిక్ష ఖరారు చేయించడంలో కీలక పాత్ర పోషించి రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందారు. ఎన్ డీపీఎస్ (మత్తు పదార్థాల కేసులు), విద్యుత్ శాఖ, మెడికల్ సంబంధిత కేసుల్లో దాదాపు 35 సంక్లిష్టమైన కేసుల్లో ముద్దాయిలకు జీవిత ఖైదు, 20 ఏళ్లు, 10 ఏళ్లు, 5 ఏళ్ల జైలు శిక్షలు పడేలా బాధితుల తరఫున బలమైన వాదనలు వినిపించారు.

### 24 ఏళ్లకే రాజకీయ రంగప్రవేశం:

చిన్న వయస్సులోనే ప్రజాసేవ పట్ల ఆకర్షితులైన చిలుకమారి వెంకటేశ్వర్లు, కేవలం 24 ఏళ్ల ప్రాయంలోనే క్రియాశీల రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2004లో ఉమ్మడి వరంగల్ డీసీసీ అధ్యక్షులు వెంకటరమణారెడ్డి హయాంలో డిసిసి సభ్యుడిగా నామినేట్ అయి పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అనేకమంది దిగ్గజ రాజకీయ నాయకులతో కలిసి వెంకటేశ్వర్లు పనిచేశారు. మాజీ ఎంపీ రామసహాయం సురేందర్ రెడ్డి, మాజీ మంత్రులు వై.యతిరాజారావు, పొన్నాల లక్ష్మయ్య, కడియం శ్రీహరి, బసవరాజు సారయ్య (ప్రస్తుత ఎమ్మెల్సీ), ప్రస్తుత మంత్రి కొండా సురేఖ, డీ.ఎస్.రెడ్యానాయక్లతో కలిసి పనిచేశారు. స్వర్గీయ కుందూరు వెంకట్రామ్ రెడ్డి, స్వర్గీయ దుగ్యాల శ్రీనివాసరావు, కొడకండ్ల కాంగ్రెస్ నాయకులు కుందూరు మధుసూదన్ రెడ్డి, స్వర్గీయ జెన్నారెడ్డి జనార్ధన్ రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్ రావు, స్వర్గీయ నూకల నరేష్ రెడ్డి, మెరుగు సత్యనారాయణ, స్వర్గీయ చెరుకుపల్లి శ్రీనివాస్ రెడ్డిలతో సాన్నిహిత్యం ఉంది.

### అవార్డుల పంట..

ఆయన చూపిన ప్రతిభకు గాను తెలంగాణ డీజీపీ, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్, ఉన్నతాధికారుల నుంచి 20కి పైగా కేసుల్లో ప్రశంసా పత్రాలు, అవార్డులు అందుకున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా వంటి ప్రముఖ జాతీయ మీడియా, ప్రాంతీయ వార్తా ఛానెళ్లు ఆయన సాధించిన విజయాలపై ప్రత్యేక ఇంటర్వ్యూలను ప్రసారం చేశాయి.

### సవాళ్లను దాటి.. సమాజ సేవ వైపు!

పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల తరఫున జడ్పీటీసీ, ఎమ్మెల్యే టికెట్ల రేసులో నిలిచినప్పటికీ, రాజకీయాల్లోని ఆర్థిక సమీకరణాల వల్ల తగిన అవకాశాలు దక్కలేదు. అయినప్పటికీ ధైర్యం కోల్పోకుండా, తన దృష్టినంతా కుటుంబంపై పెట్టి, కుమారులను ఉన్నత స్థాయిలో స్థిరపడేలా తీర్చిదిద్దారు. 30 ఏళ్లుగా సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్న వెంకటేశ్వర్లు, ఇప్పుడు లభించిన అవకాశంతో టీపీపీఎస్ (తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర స్థాయి ప్రతినిధిగా సేవలు అందించడానికి సిద్ధమయ్యారు. పేద ప్రజలకు, సొంత సామాజిక వర్గానికి, న్యాయం కావాల్సిన బాధితులకు నిరంతరం అందుబాటులో ఉంటూ తన శేష జీవితాన్ని సమాజ సేవకే అంకితం చేస్తానని ఆయన స్పష్టం చేస్తున్నారు.









### బయోడేటా

పేరు : చిలుకమారి వెంటేశ్వర్లు
తల్లిదండ్రులు : కీ.శే. చిలుకమారి రాంగోపాల్-రామక్క
విద్యార్హత : బీఎస్సీ, ఎల్ఎల్ బీ
పుట్టిన తేదీ : 28 అక్టోబర్ 1963
వృత్తి : న్యాయవాది
భార్య : అరుణ శ్రీ
పెద్ద కుమారుడు డాక్టర్ గోపీనాథ్-డాక్టర్ బిందు (శ్రీ చక్ర సూపర్ స్పెషాలిటీ హస్పిటల్)
రెండో కుమారడు రఘునాథ్- మౌనిక (సాఫ్ట్ వేర్ యూఎస్ఏ)
మూడో కుమారుడు సాయినాథ్- శ్రావ్య (సాఫ్ట్ వేర్ యూఎస్ఏ)
నివాసం : గున్నెపల్లి గ్రామం, దంతాలపల్లి మండలం, మహబూబాబాద్ జిల్లా

# కాలేయ ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం




- డీఎంహెచ్‌వో డా. పుట్ల శ్రీనివాస్
- ఘనంగా ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** హెపటైటిస్ వ్యాధి నిర్మూలనకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని హైదరాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ సెమినార్ హాల్లో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డా.పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ.. వైరల్ హెపటైటిస్ వ్యాధి పట్ల ప్రజల్లో పూర్తి స్థాయి అవగాహన పెంపొందించడం, ముందస్తు పరీక్షలు, సకాలంలో చికిత్స, అలాగే టీకాల ప్రాముఖ్యతను తెలియజేయడమే ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. హెపటైటిస్ అనేది కాలేయానికి వచ్చే వాపు సంబంధిత వ్యాధి. ఇది ప్రధానంగా ఏ, బీ, సీ, డీ, ఈ అనే ఐదు రకాల వైరస్‌ల వల్ల వస్తుంది. ముఖ్యంగా హెపటైటిస్ బీ, సీ రకాలు దీర్ఘకాలిక వ్యాధులుగా మారి.. కాలేయ సిరోసిస్, కాలేయ క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. కలుషిత ఆహారం, నీటి ద్వారా హెపటైటిస్ ఏ, ఈ రకాలు వ్యాపిస్తాయి. కలుషితమైన రక్తం లేదా రక్త ఉత్పత్తుల వినియోగం వల్ల. సిరంజిల ద్వారా: ఒకసారి వాడిన సూదులు, సిరంజిలను మళ్లీ వాడటం వల్ల. అసురక్షిత లైంగిక సంబంధాలు మరియు గర్భిణీ తల్లి నుండి పుట్టబోయే శిశువుకు (ప్రత్యేకించి హెపటైటిస్ బీ) సోకే అవకాశం ఉంది. హెపటైటిస్ బీ నివారణకు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా టీకా వేయించుకోవాలి. కేవలం పరీక్షించిన సురక్షితమైన రక్తాన్ని మాత్రమే వినియోగించాలి. వైద్య చికిత్సలో ఎప్పుడూ కొత్త, సింగిల్-యూజ్ (ఒకసారి మాత్రమే వాడే) సూదులు, సిరంజిలనే ఉపయోగించాలి. గర్భిణీలు వైద్యుల సూచన మేరకు తప్పనిసరిగా తగిన పరీక్షలు చేయించుకోవాలి. హెపటైటిస్‌ను ముందుగానే గుర్తించడం ద్వారా సమర్థవంతమైన చికిత్స పొందవచ్చని డా.శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యంగా హెపటైటిస్ బీ, సీ బాధితులు నిర్లక్ష్యం చేయకుండా, వెంటనే వైద్యుల సలహా మేరకు తగిన పరీక్షలు,చికిత్స తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# విలువల రాజకీయాలకు మారుపేరు జైపాల్ రెడ్డి

**జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్**




**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** భారత మాజీ కేంద్ర మంత్రి, ఉత్తమ పార్లమెటేరియన్ మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీ సూదిని జైపాల్ రెడ్డి 7వ వర్ధంతి సందర్భంగా.. హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పి.వి.ఎన్.ఆర్ మార్గ్ వద్ద ఆయన స్మారక వనంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే శ్రీ వి. నవీన్ యాదవ్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి సమాధికి పుష్పాంజలి ఘటించి, ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. జైపాల్ రెడ్డి జీవితాంతం ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి రాజకీయాలు చేసిన అరుదైన నాయకుడని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కొనియాడారు. తన అసాధారణ మేధస్సు, అద్భుతమైన వాక్చాతుర్యం, ఉన్నత పార్లమెంటరీ సంప్రదాయాలతో ఆయన దేశ రాజకీయ చరిత్రలో చెరగని ముద్రవేశారని అన్నారు. జైపాల్ రెడ్డి ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని, ప్రజాసేవకు అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.



# నేరెళ్ల దాష్టీకం తెలంగాణ సమాజం తలదించుకునే సంఘటన

- అప్పుడు పాలించిన కుటుంబంలో ఉన్నందుకు నేను సిగ్గుతో తలదించుకుంటూ క్షమాపణ అడుగుతున్నా
- రేవంత్ రెడ్డి, బండి సంజయ్, కేటీఆర్ లు బాధితులకు ఎందుకు న్యాయం చేయటం లేదు?
- దాష్టీకానికి పాల్పడిన పోలీసులకు, ధనదాహంతో ప్రాణాలు తీసిన బడా బాబులకు ఎందుకు శిక్ష పడలేదు?
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

**నేరెళ్ల/ సిరిసిల్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నందుకు గత ప్రభుత్వ హయాంలో నేరెళ్లలో జరిగిన పోలీసుల దాష్టీకం మొత్తం తెలంగాణ సమాజమే సిగ్గుతో తలదించుకునేలా చేసిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో తాను కూడా అధికార కుటుంబంలో భాగస్వామ్యంగా ఉన్నందుకు సిగ్గుతో తలదించుకుంటూ బాధితులకు క్షమాపణ చెబుతున్నానని అన్నారు. నేరెళ్లలో పోలీసుల థర్డ్ డిగ్రీ ప్రయోగం వల్ల అనారోగ్యపాలై ఇటీవల మృతి చెందిన గంధం గోపాల్ కుటుంబాన్ని, అలాగే మరో బాధితుడు బానయ్య నివాసంలో హరీశ్ తదితరులను మంగళవారం ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితులకు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

## కవిత ప్రధాన డిమాండ్లు..

సంఘటన జరిగి దాదాపు 9 సంవత్సరాలు గడుస్తున్నా.. అప్పట్లో దారుణానికి పాల్పడిన పోలీసులకు గానీ, ధనదాహంతో పేదల ప్రాణాలు తీసిన పెద్దలకు గానీ ఇప్పటివరకు శిక్ష పడకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల బాధిత కుటుంబాలకు ఇప్పటివరకు రూపాయి సాయం కూడా అందలేదని, ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ. కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై రాజకీయాలు పక్కనపెట్టి, అన్ని పార్టీలు మానవత్వంతో బాధితులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. తాము టూరిస్టుల మాదిరిగా వచ్చి పరామర్శించి వెళ్లబోమని, బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని స్పష్టం చేశారు.

## రాజకీయ నాయకులపై ప్రశ్నల వర్షం..

నేరెళ్ల బాధితుల కన్నీళ్ల పునాదులపైనే సీఎం రేవంత్ రెడ్డి అధికారం సాధించారని, అప్పట్లో మీరా కుమార్, పొన్నం ప్రభాకర్, భట్టి విక్రమార్క, అద్లూరి లక్ష్మణ్‌లను తీసుకొచ్చి హడావుడి చేసిన నేతలు.. అధికారంలోకి వచ్చి 30 నెలలు అవుతున్నా నేరెళ్ల పేరే ఎత్తడం లేదని మండిపడ్డారు. ఈ ఘటనను ఉపయోగించుకుని ఓట్లు వేయించుకున్న బండి సంజయ్.. అప్పట్లో తీసుకొచ్చిన 'జాతీయ ఎస్సీ కమిషన్' నివేదిక ఏమైందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. అవసరమైతే బాధితులతో కలిసి ఢిల్లీకి వెళ్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ స్పందించి బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఇసుక లారీల వల్ల ఒక చిన్నారి ప్రాణం పోవడంతో, దానిని నిరసించిన 8 మంది స్థానికులను పోలీసులు ఐదు రోజుల పాటు తీవ్ర చిత్రహింసలకు (థర్డ్ డిగ్రీ) గురిచేశారు. జైలర్ సైతం వారి గాయాలు చూసి జైలోకి తీసుకోవడానికి నిరాకరించడంతో ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. అయితే దోషులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కావని కవిత అభిప్రాయపడ్డారు. తెలంగాణను రక్షించుకునేందుకే 'తెలంగాణ రక్షణ సేన'ను ఏర్పాటు చేశామని, తెలంగాణ ఆడబిడ్డగా బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని ఆమె తేల్చిచెప్పారు.

